ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

తుఫాన్ ప్రభావిత కాలనీలో పర్యవేక్షణ




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 307 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 31 అక్టోబర్ 2025



## ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

**ముజాఫర్‌పుర్:30 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీహారీ ప్రజలు గొప్పగా జరుపుకునే ఛాట్ పూజకు .. యునెస్కో వారసత్వ సంపద గుర్తింపు తీసుకురానున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇవాళ ముజాఫర్‌పుర్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఎంతో సంతోషంగా బీహారీ ప్రజలు ఛాట్ పూజను జరుపుకుంటారని, ఆ పండుగను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తున్నదని, మిగతా2లో...

## రైతులకు వేదన మిగిల్చిన

# తుఫాన్



● అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి ● నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి ● విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి ● వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి ● కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి ● నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సిఎం పర్యటన

**హైదరాబాద్,30 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం మిగతా2లో...

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల




## దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది

10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన



**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. మిగతా2లో...

## చంద్రబాబు ముందస్తు చర్యలతో

# నష్టనివారణ

46 వేల హెక్టార్లలో వరికి నష్టం కలిగింది

14 వేల హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటి సిఎం

బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్





**విజయవాడ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మిగతా2లో...

# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జాదన్న భట్టి
- బిజెపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్



**హైదరాబాద్,30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి వర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో మిగతా2లో...



## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

**హైదరాబాద్, 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ మిగతా2లో...

## జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి మిగతా2లో...


## వరంగల్ ముంపు ప్రాంతాల్లో

# పోలీస్ సేవలు



- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీకి ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించు కోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక



సామగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగిం చుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న మిగతా2లో...

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన



**హైదరాబాద్, 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు.

మిగతా2లో...

# దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జిన్‌పింగ్ తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

# రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల న్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.


# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

(మొదటి పేజీ తరువాయి)

నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దిన్‌ను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


(మొదటి పేజీ తరువాయి)



పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్ లో పర్యటిం చాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతుల ను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగా న్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్రం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

## ● రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి



**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷-దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

# ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

కానీ తమ ప్రభుత్వం ఛాట్ పూజకు యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తునదన్నారు. ఓట్ల కోసం ఛాట్ ఉత్సవాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ అవమానిస్తున్నదన్నారు. రైల్వేను లూటీ చేసినవాళ్లు.. బీహార్ ప్రాంతాన్ని ఎలా డెవలప్ చేస్తారని అన్నారు. బీహార్‌లో జంగిల్‌రాజ్ నడిచిందని, ఆర్జేడీ గుండాలు షోరూమ్‌లకు వెళ్లి వాహనాలను ఎత్తుకెళ్లినట్లు ఆరోపించారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తం గా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది.

# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# క్షేత్ర స్థాయిలో అందు బాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి

**తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు**

**తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి**

**మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

**ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు**

**24/7 అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి**

**మొంథా తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎం**





**హనుమకొండ, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారి ఇంచార్జిగా పెట్టాలని, ధాన్యం కొనుగోలు చేయడం, అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవడం, ధాన్యం తరలింపు, అవసరమైతే స్థానికంగా ధాన్యం స్టోర్ చేయడం వంటి పనులు చేపట్టాలని అన్నారు. ప్రతి రోజు ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి కలెక్టర్ కు క్షేత్ర స్థాయి పరిస్థితులపై రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రతి కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి చాలా కీలకమని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి క్షేత్ర స్థాయిలో పని చేయాలని అన్నారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న రోడ్ల వద్ద వాహనాల రాకపోకలు నిలిపి వేయాలని అన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, నీటి వనరుల సమాచారం తెలుసుకొని, వాటికి సమీపంలో ఉన్న రోడ్లు, వంతెనలపై రాక పోకలను నిలిపివేయాలని, దీని కోసం స్థానిక పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు పడటం వల్ల తీవ్రంగా నష్టం జరిగిందని అన్నారు. పంట కోతల సమయంలో ఇలాంటి తుఫాన్ రావడం దుర దృష్టకరమని, రైతులకు మొంథా తుఫాన్ తీవ్ర ఆవేదన కలిగించిందని సీఎం తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు చేయాలని, ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ పని చేయాలని అన్నారు. వరదల నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్, ఇతర పరికరాలు ఫీల్డ్ లో సిద్ధం పెట్టుకోవాలని, విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ లు సన్నద్ధం చేయాలని, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. తుఫాన్ వల్ల ప్రాణ నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని అన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ క్రింద అవసరమైతే ఫంక్షన్ హాల్ లను వినియోగిస్తూ పంటలను స్టోర్ చేయాలని అన్నారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అవసరమైన జిల్లాలకు తరలించాలని అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో కలెక్టరేట్ లలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ వారికి అవసరమైన వైద్యం, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా విద్యుత్ సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు డిస్కం అధికారులు తీసుకోవాలని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న 33/11 కేవి సబ్ స్టేషన్, 33 కేవి, 11 కేవి లైన్లను ఇప్పటికే 75 శాతం వరకు మరమ్మత్తు చేసి సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్లు అందుబాటులో ఉన్న నిధులు వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అధికంగా అందుబాటులో పెట్టాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల అంచనాల కంటే రెట్టింపు వర్షాలు పడ్డాయని, రైతులు తీవ్రంగా నష్ట పోయారని అన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో వెళ్ళి పంట నష్టం ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యం ఈ రోజే వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ లో లెవల్ కల్వర్ట్ దగ్గర పోలీసు భద్రత ఏర్పాటు చేసి ప్రయాణాలు అడ్డు కోవాలని అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి వర్యులు కొండ సురేఖ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రజల ప్రాణాల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుందని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశామని అన్నారు. ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. మరో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాన్ కారణంగా వచ్చిన భారీ ఆస్తి నష్టం నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచేలా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ సంబంధించి దెబ్బతిన్న రోడ్లు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మత్తులు చేసి వాహనాల రాకపోకలను వీలైనంత మేరకు పునః ప్రారంభించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న కాల్వలు, తెగిపోయిన చెరువులు, మీడియం ప్రాజెక్టుల నష్టం అంచనాలను తయారు చేయాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావిత కాలనీలో పర్యవేక్షణ

**• బొచ్చు కోమల-జెమిని**



**పరకాల, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరకాల పట్టణంలోని పలు కాలనీల్లో పరిస్థితిని పరిశీలించిన యూత్ కాంగ్రెస్ వరంగల్ అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బొచ్చు కోమల-జెమిని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్, జిల్లా యూత్ కాంగ్రెస్ మరియు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఇచ్చిన సూచనల మేరకు, బొచ్చు కోమల లోతట్టు ప్రాంతాలను సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. వర్షం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ధైర్యం చెబుతూ జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బొచ్చు సాంబయ్య, బొచ్చు కిరణ్, ఒంటేరు రాజు, ఒంటేరు అజయ్, ఒంటేరు రాహుల్, సంగి జస్వంత్, చెరుపల్లి సదయ్య, సరోజన, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు. ప్రజల పట్ల అంకితభావంతో, ఎప్పుడూ సేవలో ముందుండే బొచ్చు కోమల-జెమిని గారి పర్యటనకు స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

# 14 ట్రాక్టర్ల వరి ధాన్యం వరద పాలు

**- ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి రైతు బలేరావు ఆదిత్య ఆవేదన**



తుఫాను వర్షంతో వడ్లు తడవడంతో రోదిస్తున్న రైతులు

**హనుమకొండ, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన రైతు బలేరావు ఆదిత్యకు తీవ్ర నష్టం జరిగింది. అప్పులు తెచ్చి కష్టపడి సాగు చేసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టగా, బుధవారం ఉదయం నుండి కురుస్తున్న అకాల వర్షం కారణంగా 14 ట్రాక్టర్ల వరి ధాన్యం వరదలో కొట్టుకుపోయిన సంఘటన మండలంలో చోటుచేసుకుందికష్టపడి సాగు చేసి, పెట్టుబడులు పెట్టిన ధాన్యం నీటమునిగిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఋణాలు తీసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాను అని ఇప్పుడు అంతా నీటిలో కలిసిపోయింది కుటుంబం ఎలా పోషించాలో అర్థం కావడం లేదు” అని ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. ఘటనపై స్పందిస్తూ ప్రభుత్వం వెంటనే రైతులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం, రుణ మాఫీ వంటి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గోపాల్పూర్ చెరువు కోత కారణంగా మునిగిన కాలనీలను పరిశీలించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు






**హనుమకొండ, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్పూర్ చెరువు కోత కారణంగా వివేక్ నగర్, అమరావతి నగర్ తదితర కాలనీలు నీట మునిగిన నేపథ్యంలో గురువారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీట మునిగిన ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి తగిన ఆహారం, త్రాగునీరు అంద జేయాలని హన్మకొండ కలెక్టర్ తో ఫోన్ లైన్ లో మాట్లాడి సహాయక చర్యలు అందించాలని పలు శాఖల అధికారులతో ఎప్పటికీ అప్పుడు సహాయక చర్యలు చేపడుతూ పర్య వేక్షణలో ఉండాలని ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుఫాను ప్రభావం తో అకాల వర్షాల కారణంగా ప్రజల ఆస్తి నష్టం జరగడం దుర దృష్టకరమని ఆయన తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాంగ్రెస్ నాయకులు కందుకూరి పూర్ణచందర్, అనిత, చింత రమేష్ తో పాటు డివిజన్ నాయకులు వివిధ కాలనీ వారు తదితరులు ఉన్నారు.

# బస్టాండులో కాళీ కుర్చీల దర్శనం

**- మూడు రూట్లో బస్సులు లేక అవస్థలు పడుతున్న ప్రయాణికులు**

**- రహదారులపై పొంగుతున్న వాగులు**





**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరోనా సమయంలో ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా ఖాళీగా కనబడితే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో పడుతున్న తుఫాన్ వలన వచ్చే భారీ వర్షాలకు రహదారులన్నీ జలమయం కావడంతో ప్రయాణికులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసిన మంగళవారం, బుధవారం చెరువులు ముత్తడి దూ కుతూ వాగులలో నీరు ప్రవహిస్తూ రోడ్లపైకి రావడంతో బుధవారం రోజు టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ తొర్రూరు నుండి వరంగల్, సూర్యాపేట , మహబూబాబాద్, నర్సంపేట, ఇతర పల్లెల కు వెళ్లాల్సిన బస్సులు వెళ్లలేకపోవడంతో ప్రయాణికులు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. వర్షాలు తగ్గినప్పటికీ కూడా గురువారం రోజు రోడ్ల పైన ప్రవహిస్తున్న వర్షపు నీరు కారణంగా సూర్యాపేట, మహబూబాబాద్, నర్సంపేట, వెళ్లాల్సిన బస్సులు డిపో లోనే నిలిచిపోయాయి. బస్సులే కాక రహదారులలో ఏ వాహనం కూడా నడిచే పరిస్థితి లేక ప్రయాణికులు ఎక్కడివారక్కడ నిలిచిపోయి ఉన్నారు. గుర్తూరు ఈదుల వాగు ప్రాంతంలో ఎవరు వెళ్లకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల లో నడిచే బస్సు శుక్రవారం వరద తగ్గుముఖం పడితేనే బస్సులను నడిచే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు.




# తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంజుల నియామకం




**హనుమకొండ, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్టోబర్ 28, 29 తేదీలలో ఉత్తర ప్రదేశ్ ఝూన్సీ లో జరిగిన భారతీయ కళాకార్ సంఘ్ జాతీయ సమావేశానికి హనుమకొండ గోపాలపురానికి చెందిన ప్రముఖ చిత్రకారిణి, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎల్ బి కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సాగంటి మంజులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు మంజుల సమావేశానికి హాజరైంది. తన చిత్ర కళా పటిమను, చిత్ర చేస్తున్న సేవను గుర్తించి జాతీయ స్థాయి చిత్రకారుల సంస్థ ఐన భారతీయ కళాకార్ సంఘ్ లో మంజులకు తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతలు అప్పగించి, నియామక పత్రం అందజేశారు. దేశం నలు మూలల నుండి వేల మంది చిత్రకారులు హాజరు కాగా విజయవంతంగా ముగిసిన ఈ సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు అంకూర్, జాతీయ అధ్యక్షుడు, కుమార్, యూ పి అధ్యక్షులు పాలన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో మంజులకు నియామక పత్రాన్ని అందించి వేలమంది సమక్షంలో గౌరవ ప్రదమైన రీతిలో సన్మానం చేశారు. రాష్ట్ర కమిటీ ల ఏర్పాటు లో తెలంగాణ రాష్ట్ర కమిటీనీ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా జి. రాము, ఉపాధ్యక్షులుగా కె. మోహన్, ప్రధాన కార్యదర్శి గా సి హెచ్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఈ. బాలు, ప్రచార కార్యదర్శిగా జి. ఆంజనేయులు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కె. పద్మావతి, లను నియమించి పదవి బాధ్యతలు అప్పగించి ప్రమాణ స్వీకారం చేయించారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ కళాకారుల హక్కులను కాపాడి చిత్ర కళకు మరింత మంచి గుర్తింపు తెస్తామని మాట ఇస్తూ, జాతీయ కార్య వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తెలంగాణ లో జరుగబోయే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# బమ్మెర గ్రామంలో ఒక ఇంట్లో దర్శనం ఇచ్చిన కొండచిలువ

**భయభ్రాంతులకు గురైన ఇంటి యజమానితో పాటు గ్రామస్తులు.**

**గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేసిన గ్రామస్తులు.**



**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి మండలంలోని గురువారం రాత్రి 8. 00 8 గంటలకు వల్లెపు కుమారస్వామి ఇంటి ఆవరణలో ((బీసీ కాలనీ) కొండచిలువ సంచరిస్తున్న దృశ్యం గ్రామస్థలం దర్శనమిచ్చింది. బమ్మెర బీసీ కాలనీలో కొండచిలువ సంచరిస్తున్న దృశ్యాన్ని చూసి బీసీ కాలనీవాసులు భయభ్రాంతులకు గురై తక్షణమే బిసి కాలనీలో ప్రతి స్తంభానికి పెద్ద వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. గ్రామస్తులు గ్రామ కార్యదర్శి కి గ్రామంలో కొండ చిలువ సంచారిస్తున్నట్లు వారికి తెలిపారు. వెంటనే ఆ ప్రాంతాన్ని పాములు పట్టే వారిని పిలిచి గ్రామంలో ఇంకా ఏమైనా కొండ చిలువలు తిరుగుతున్నాయా అనే కోణం లో పరిశీలించాలనిగ్రామస్తులు బిసి కాలనీవాసులు కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న వాజేడు ఆటో యూనియన్ కమిటీ



**వాజేడు అక్టోబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని చింతూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌పేట నగేష్ అనారోగ్యం మరణించిన విషయం తెలుసుకున్న వాజేడు ఆటో యూనియన్ కమిటీ సభ్యులు, పేట నగేష్ కుటుంబాన్ని పరామర్శించి అతని భార్యకు 3,100 నగదును అందజేశారుజగన్నాధపురం (పాయబాట్ల ) ఆటో మెకానిక్, బద్ది నాగరాజు 25 కేజీల సన్నాబియ్యం బస్తాను యూనియన్ సభ్యులధ్వారా మృతుడు పేట నగేష్ భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జిమిడి చిరంజీవి, కార్యదర్శి కొగిల రాజు, కమిటీ సభ్యులు, జనగం కేశవరావు, యాలం ప్రభాకర్, కాట జయరాజు, కుమ్మరి మల్లయ్య, కావిరి శ్రీను, బగుతు సిద్ధు, దెబ్బ దుర్గరావు, తదితరులు పాల్గొన్నారు

## నీట మునిగిన లక్ష్మీ హెూమ్స్ ఇండ్ల సమస్యను పరిష్కరించిన కోమటిరెడ్డి...





**కరీంనగర్ జిల్లా అక్టోబర్ 30(పిసి డబ్ల్యూ న్యూస్):** మొంథా తూఫాన్ కారణంగా కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షం నేపథ్యంలో మల్కాపూర్ గ్రామంలో భారీ వరద నీరు చేరడం వల్ల నీట మునిగిన లక్ష్మీ హెూమ్స్ లలో గల ఇండ్లను, తాత్కాలికంగా నీటిని బయటకు పంపించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

## రైతాంగాన్ని నిలువునా ముంచిన అకాల వర్షం

**- తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్**





**హనుమకొండ, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** అకాల వర్షాల వలన పంటల నష్టం జరిగి రైతాంగం తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. బుధవారం రోజున హసన్ పర్తి మండలంలో కురిసిన జడివాన మూలంగా కళ్ళము లోని పంట కంచం లోకి వచ్చే సమయంలో గద్ద తన్నుకు పోయినట్లు ప్రకృతి కన్నీరు చేసి రైతాంగాన్ని పంట నష్టంతో నిండా ముంచిందని నేదునూరి రాజమౌళి ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం రాష్ట్ర నాయకులు మెట్టు శ్యాంసుందర్ రెడ్డి హసన్ పర్తి మండల సిపిఐ కార్యదర్శి లు తెలిపారు తీవ్ర తుఫాన్ మూలంగా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో 100 ఎకరాలలో వరి పంట దెబ్బ తిన్నదని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి పంట నష్ట పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గురువారం రోజున ఎల్లాపూర్ గ్రామ శివారులో వరద కారణంగా నష్టపోయిన వరి వరి పొలాలను సందర్శించడం జరిగినది ఈ కార్యక్రమంలో నేదునూరి రాజమౌళి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి. రైతులు బొద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి గంగిండ్ల ఈశ్వర్ రెడ్డి గోపు బుచ్చిరెడ్డ కల్వచర్ల ఈశ్వర్ లింగం జూపాక శ్రీలత ఆది రవీందర్ గోపరాజు రవి ఎర్ర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# కపిల్ బాల కుటీర్ సిసిఐ హెూమ్‌లో స్వచ్ఛభారత్...





**కరీంనగర్,అక్టోబర్30(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం లోని కపిల్ బాల కుటీర్ సీసీఐ హెూమ్ లో గురువారం రోజున స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు సీసీఐ హెూమ్ ను సిడబ్ల్యుసి మెంబర్ కళింగ శేఖర్ , డిసిపిఓ పర్వీన్, డి సి పి యు పూదరి శాంతలు సందర్శించి, మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లో పాల్గొని సీసీఐ హెూమ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆశ్రమంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ హెూమ్ లో ఉంటున్న విద్యార్థిని విద్యార్థులు మన చుట్టూ ఉన్న ప్రాంతాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని , అనారోగ్యం దరిచేరదన్నారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న పిల్లలందరూ లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థితికి రావాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో కపిల్ బాలకుటీర్ ఉపాధ్యక్షులు రాజారెడ్డి, ఇంచార్జ్ వకుళాదేవి, కృష్ణవేణి, శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎఫ్‌సిఎల్‌ను కాపాడుకుందాం !

**- అదే దిశలో కార్మిక హక్కులను రక్షించుకుందాం!!**

**- ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యం కార్మిక సంఘాలతో కార్మిక సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించాలి.**

**- TUCI పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్.**



**గోదావరిఖని,అక్టోబర్30(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎన్నో సుదీర్ఘ పోరాటాలు ఎన్నో ఆటుపోటులు ఎంతగానో నిరీక్షణ అనంతరం ఎఫ్సీఐ స్థానంలో ఏర్పడ్డ ఆర్ఎఫ్‌సిఎల్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో కుటుంబం లాగా వ్యవహరించిన ఎఫ్సీఐ నేడు ఆ వాతావరణమే లేకపోవడము మరింతగా ఆందోళనకు గురి చేస్తున్నది. ఆర్ఎఫ్‌సిఎల్ యాజమాన్యము పారిశ్రామిక శాంతికి విఘాతం కలిగించే విధంగా కార్మిక సంఘాలను ప్రవేశించకుండా ఒక నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం కూడా ఈ పరిస్థితికి కారణం అవుతున్నది. ఒకప్పుడు 4వేల మందితో నడిచిన పరిశ్రమ నేడు 850 మంది కాంట్రాక్టు కార్మికులు 500 మంది పర్మనెంట్ కార్మికులతో నడుస్తున్న వాతావరణ మధ్య కార్మికులకు యాజమాన్యానికి మధ్య సహృద్భావ వాతావరణం లేకపోవడం అనేది ఇక్కడ పారిశ్రామిక శాంతికి మరింతగా విఘాతం కలిగిస్తున్నది. ఇప్పటికే చీటికిమాటికి పరిశ్రమ రిపేర్ కావడం ఏడాదిలో మూడు నెలలకు పైగా బందు కావడం నష్టాలకు గురి కావడం జరుగుతూ వస్తున్నది. కార్మిక సమస్యలపై కార్మిక హక్కులపై న్యాయబద్ధంగా రావాల్సిన వాటిని చెల్లించాల్సిన యాజమాన్యం మాకు ఏమీ సంబంధం లేదంటూ కాంట్రాక్టర్లపై తోసి తప్పించుకునే విధంగా వ్యవహరించడం కూడా కార్మికుల అసంతృప్తికి తోడు అవుతున్నది. ఒకటికి పదిసార్లు యాజమాన్యంతో చర్చించి కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన సంఘాలు చీటికిమాటికి సమ్మె వాతావరణం సృష్టిస్తూ ఉండడం కూడా సరి అయిన వాతావరణం కాదు. అన్ని సంఘాలతో చర్చించి కార్మిక శాఖ అధికారులతో చర్చించి చివరకు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సమ్మె అనే ఆయుధాన్ని యాజమాన్యంపై ఉపయోగించాలి కానీ, ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. కార్మిక హక్కులపై ప్రిన్సిపల్ బాధ్యత ముమ్మాటికి యాజమాన్యానిదే. ఆ బాధ్యత నుంచి ఎప్పటికీ తప్పించుకోలేదు. చట్టబద్ధంగా రావలసిన హక్కులను కార్మికులకు అమలు చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాం. కార్మిక సంఘాలతో ఇప్పటికైనా నెలకు ఒకసారి కార్మిక సమస్యలపై చర్చించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థను కాపాడుకుందాం అని కార్మిక సమస్యలపై అన్ని సంఘాల నాయకత్వంలో ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిస్తున్నాం చర్చలకు అన్ని సంఘాలతో ముందుకు రావాలని కోరుతున్నాం.


## గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ యూనిటీ" కార్యక్రమం



**గంగాధర అక్టోబర్ 30(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఈ రోజున సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా జాతి ఐక్యత దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఈరోజు స్థానిక ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో మధుర నగర్ లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినిలు, కళాశాల సిబ్బంది,స్థానిక రాజకీయ నాయకులు మరియు ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి గంగాధర మండల కేంద్రంలో 2KM "వాక్ ఫర్ యూనిటీ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్ఐ గారు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ యొక్క ఉద్దేశాలను, ఆశయాలను పాఠశాల విద్యార్థులకు వివరించడం జరిగింది. పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థినిలు తమకు ఏ సమస్య ఉన్న వెంటనే పాఠశాల ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో లేదా నేరుగా పోలీసులకు వెంటనే చెప్పాలని, ఇంకా ఇతర ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని వెంటనే మేము పరిష్కరిస్తామని ఇస్తామని ఎస్ఐ వంశీకృష్ణ తెలపడం జరిగింది.

# బొమ్మకల్‌లో దేవుడి స్థలాన్ని కాపాడండి...

- **తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని దేవుడి స్థల విషయంలో కాలనీ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి..**
- **జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు శ్రీ రాజరాజేశ్వర నగర్ కాలనీ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు..**



**కరీంనగర్,అక్టోబర్30(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం బొమ్మకల్ శివారు సర్వేనెంబర్ 125, 126, 129 లోని 10 ఎకరాల భూమిలో లోగోడ లేఔట్ చేసి , దేవుడి గుడి నిర్మాణం కోసం స్థలం విడిచిపెడితే నేడు కొంతమంది ఆ స్థలంపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీ రాజరాజేశ్వర నగర్ కాలనీ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గాండ్ల లక్ష్మీనారాయణ, అసోసియేషన్ బాధ్యులు, కాలనీ ప్రజలు గురువారం రోజున జిల్లా కలెక్టర్కు, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 1989 లో చేసిన ఇక్కడి లేఔట్ లో 270 ప్లాట్లు చేశారని, ఇందులో గుడి నిర్మాణం కోసం స్థలం విడిచిపెట్టారని తెలిపారు. అయితే కాలనీవాసుల సహకారంతో హనుమాన్ దేవాలయం నిర్మాణం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అయితే శ్రీకర్ అనే వ్యక్తి 2025 సంవత్సరంలో దేవుడి స్థలం కబ్జా చేయడానికి ఆ స్థలాన్ని తప్పుడుగా రిజిస్టర్ చేసుకొని కాలనీ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులో వివరించారు. కనుక తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలం విషయంపై తగిన విచారణ చేపట్టి, అక్రమంగా తప్పుడు గా రిజిస్ట్రేషన్ చేసుకుని కాలనీ ప్రజలను ఇబ్బందులను గురిచేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి...

- **తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి**
- **బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ డిమాండ్**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్30 (పీసీడబ్ల్యూ న్యూస్):** బుధవారం కురిసిన అకాల వర్షానికి మండలంలో నష్టపోయిన రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించి, పై నుండి వస్తున్న వాగు ఉధృతి పెరగడంతో మార్కెట్ యార్డులోకి కూడా నీళ్లు వచ్చి రైతుల ధాన్యం మొత్తం కొట్టుకపోవడంతో రైతులు విలపించగా వారిని ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, మండలంలో పలు గ్రామాల్లో చేతికొచ్చిన పంట నీట మునగడంతో చాలామంది రైతులు నష్టపోయారని వారికి ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజేపి రైతుల పక్షాన ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**ప్రభుత్వ పరమైన ఫలాలు పొందడం మీ హక్కు: తహసీల్దార్ నంగునూరి రమేష్**



**ఖానాపురం అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఖానాపురం మండలం తహసీల్దార్ వారి ఆధ్వర్యంలో గొల్లగూడెం తండా, బోటిమిది తండా పంచాయితీపరిధిలో గొల్లగూడెం తండా నందు ఏర్పాటు చేసినటువంటి పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసిల్దార్ మాట్లాడుతూ.. చదువు లేక ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన లేక ఎన్నో ప్రభుత్వ పథకాలకు ఈ గిరిజన ప్రజలు దూరమవుతున్నారని, భారత రాజ్యాంగం నందు మీకొరకు పొందుపరచిన రిజర్వేషన్లు, ప్రత్యేకంగా కేటాయించిన పథకాలు పొందడం కూడా మీ హక్కుగా భావించాలని తెలియజేశారు. ఆధార్ కార్డులు రేషన్ కార్డులు మరియు ఇళ్ల పట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. మీ అవసరాలను అర్జీ రూపంలో తీసుకొని వచ్చిన ఎడల చట్టపరిధిలో మీకు న్యాయం చేయగలనని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ ఇన్స్పెక్టర్ రఘుపతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మనిషికి రాజ్యాంగపరంగా జీవించే హక్కు ఉందని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలగనంత వరకు మీ స్వేచ్ఛను ఉపయోగించుకోవచ్చని తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం నందు పొందుపరిచిన ఫలాలను ఉపయోగించుకొని ప్రతి ఒక్క పేద విద్యార్థి అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ చెన్న మల్ల స్వామి,జి పి ఓ వెంకటేశ్వర్లు,ఏ ఈ ఓ అంకుష్ వలి, ఏ ఎన్ ఎం వినోద,ఆశ వర్కర్ మచ్చ సునీత,మాజీ సర్పంచ్ గుగులోతు తరమ్మా,ఖానాపురం మండల లంబాడి జేఏసీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్,గుగులోతు లింబా,గుగులోతు హాచ్యా,తేజవత్ లవన్,గుగులోతు రాజు,బానోతు యకమ్మ,మూడు అజిత్ ప్రజలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాలతో వర్షం కారణంగా కూలిన ఇళ్లను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు, జిపిఓ

**- 66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్**



**హన్మకొండ,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):** విశ్రాంత ఐపీఎస్ వర్ధన్నపేట శాసన సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గురువారం గ్రేటర్ వరంగల్ హాసన్ పర్తి 66 వ డివిజన్ లో మోంథా తుఫాను వర్షం కారణంగా నిన్న కురిసిన వానతో బోట్ల సుధాకర్. నివాసాన్ని అధికారుల అప్రమత్తతో ఎలాంటి ఆస్తి, ప్రాణం నష్టం జరగకుండా మరియు కూలిన ఇళ్లను సందర్శించి కచ్చితంగా ఎమ్మెల్యే హామీతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో 66 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనపర్తి కిరణ్. జి పి ఓ అనిత, డివిజన్ యూత్ ప్రెసిడెంట్ తాళ్ల మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గరిగే రాజు, తాళ్ల ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు

## సురక్షిత ప్రాంతానికి తరలించిన అధికారులు



**హన్మకొండ,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):**హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజ్ మరియు ఎం జె పి స్కూల్ ప్రాంగణం వద్ద అకస్మాత్తు గా పెరిగిన వరద ప్రవాహం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మండల ఎమ్మార్వో చల్ల ప్రసాద్ ఆర్ఐ పజిల్ పోలీసులు సిఐ చేరాలు ఎస్సై దేవేందర్ తక్షణమే స్పందించి విద్యార్థులను ఉపాధ్యాయులను వరద ప్రవాహం నుంచి సురక్షిత ప్రాంతంకు తరలించారు.

## ఫసల్ భీమా పథకం అమలు చేయుటలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**- భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు ఆబోతు రాజు యాదవ్**




**ఖానాపూర్ అక్టోబర్ 30,(పీసీడబ్ల్యూ న్యూస్):** గత 4, 5 సంవస్సరాలుగా రైతులకు అకాల వర్షాల వలన, చీడ, పీడ ల వలన వాతావరణ మార్పుల వలన, చేతికి వచ్చిన పంట నష్టం జరిగి రైతులు నష్ట పోతున్నప్పటికి, కేవలం తమ రాజకీయ స్వార్థం కొరకే రాష్ట్రంలో ఫసల్ భీమా పథకాన్ని అమలు పరిచడంలో అప్పటి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అందించే ఫసల్ భీమా పథకం రైతులకు అందకుండా,రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని అన్నారు.అకాల వర్షం వలన పంట నష్ట పోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.కేంద్ర ప్రభుత్వం అందించే ఫసల్ భీమా పథకం రాష్టంలో అమలు పరిచి ఉంటే పంట నష్ట పోయిన రైతులకు ఎంత నష్ట పరిహారం అందేదో అంతే మొత్తములో ప్రతి రైతు కు నష్ట పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కనీసం రాబోవు రభి సీజన్ నుంచి అయినా రాష్టంలో ఫసల్ భీమా పథకాన్ని అమలు పరచి రైతులకు న్యాయం చేయాలని కోరారు

# గుర్తురు రామసముద్రం చెరువు పొంచి ఉన్న పెను ప్రమాదం









**చెరువు మధ్యలో భారీగా గండి పడే అవకాశం.**

**అధికారుల అప్రమత్తం కాకుంటే చెరువు లూటి కావాల్సిందే.**

**ఆవేదన, ఆందోళన చెందుతున్న మత్స్యకారులు.**

**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తురు గ్రామ పంచాయతీల గల రామసముద్రం చెరువు నిర్మాణం చేపట్టి 120 సంవత్సరాలు కావస్తుంది అనిగ్రామ పెద్దలు కొందరు ఈ విషయాన్ని తెలియపరిచారు. రామసముద్రం చెరువు విస్తీర్ణతలో చాలా పెద్దది కావటం కేవలం ఒక గ్రామానికే కాకుండా మరో గ్రామమైన కుందూరు సోమవారం గ్రామ రైతులకు కూడా సాగునీరు అందిస్తోంది. గత 50 సంవత్సరాల క్రితం గుర్తురు గ్రామస్తులు రామసముద్రం చెరువు కట్ట పైనుండే కుందూరు సోమవారానికి కాలినడకన ప్రయాణించేవారు. ఆ సమయంలో గుర్తురు నుండి ఆర్టీసీ బస్సులు లేకపోవడం కొందూరు సోమారం లేదా లేదా కంటాయ పాలెం కట్టనుండి తొర్రూర్ కు వెళ్లి ఆర్టీసీ బస్సులను ఎక్కేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు 25 సంవత్సరాల క్రితం రామసముద్రం చెరువు కట్టకు భారీగా గండిపడి నీరు వృధాగా వెళ్ళిపోయింది. అప్పటి ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి వెంటనే టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి రెండు రోజులలో పూడ్చారు.రామసముద్రం చెరువుకు గత రెండు సంవత్సరాల క్రితం చెరువు ముత్తడి కింద పెద్ద బుంగపడి నీరు పోతున్న విషయాన్ని గ్రామస్తులు పంజాల సోమయ్య(గడి )పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర్ స్వామి దృష్టికి తీసుకువచ్చారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన జర్నలిస్టు మనోహర్ స్వామి ఆ ప్రాంతానికి వెళ్లి ఫోటోలు సేకరించి తీసుకు రావడం జరిగింది. ఆ సమయంలోనే ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేగా యశస్విని రెడ్డి గెలిచిన తర్వాత ఈ విషయాన్ని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళటం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి గ్రామస్తులకు విషయాన్ని వెల్లడిస్తూ అధికారులతో ఎండాకాలం గండి పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అప్పటి అధికారులకు విషయాన్ని తెలియపరచినప్పటికీ కూడా ఏ అధికారి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గత రెండు నెలల క్రితం మత్తడి ప్రాంతాన్ని పరిశీలించేందుకు తొర్రూరు ఆర్డీవో, అప్పటి తాసిల్దార్, కారోబార్ వేణు తో కలిసి కొంత దూరం వెళ్లి చెరువు కట్ట పూర్తిగా కంపచెట్లతో నిండిపోయి ఉన్నదని వెను తిరిగి వచ్చారు. అదే సమయంలో అధికారులతో చర్చించి వేసవికాలంలో చర్యలు తీసుకుంటే చెరువులో నుండి నీరు వృధా పోకుండా ఉండేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తిగా నిండుకుండలా మారిపోయింది. చెరువులోని చేపల పరిస్థితిని గమనించేందుకు మత్స్యకారుల సొసైటీ చైర్మన్ సింగరం కిరణ్ కుమార్ చెరువును పరిశీలించేందుకు అటుగా గురువారం రోజు వెళ్లారు.భారీ వర్షాల కారణంగా చెరువు కట్ట మధ్యలో మట్టి కొట్టుకుపోయిన దృశ్యాన్ని చూసి అవాక్కయ్యారు. చెరువుకు భారీ గండి పడే అవకాశాలు ఉన్నాయని వెంటనే మత్స్యకారులకు విషయాన్ని తెలియపరచడంతో వారందరూ వెళ్లి చెరువు కట్టను పరిశీలించారు. ఈ విషయాన్ని వెంటనే సింగర్ కిరణ్ కుమార్ ఆర్ ఐ దృష్టికి తీసుకువెళ్లగా వారు వచ్చి చెరువు కట్ట కొలతలు తీసుకువెళ్లినట్లు వెల్లడించారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే చెరువుకు గండి పడి పూర్తి నీరు వృధాగా వెళ్లే అవకాశాలు లేకపోలేదు. చెరువు కట్ట మరమ్మతులు చేపట్టాలన్న తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది అంటున్నారు గ్రామస్తులు. కట్ట పూర్తిగా బురద తో ఉండటంతో పనులు చురు కుగా కాకపోవచ్చు అని ఆందోళన వ్యక్తం చేస్తుంది. సింగరం కిరణ్ కుమార్ వెంట మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు పిల్లి నరేష్, మాజీ సర్పంచ్ సింగర్ కుమార్ మత్స్యకారుల బృందం వారితో ఉన్నారు.



# వరద ప్రభావ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

**• తక్షణ సహాయక చర్యలకు అధికారులను ఆదేశించిన కలెక్టర్**



**హన్మకొండ,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):** భారీ వర్షం కారణంగా వరద ఉధృతి పెరగడంతో నగరం లోని పలు కాలనీలు జలమయం కాగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలను గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీల పరిస్థితులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న కాలనీల్లో తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డిఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాలపూర్ ఊర చెరువు తో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్య నగర్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆయా ప్రాంతాలలోని కాలనీలు వరద నీటిలో చిక్కుకోగా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించి తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. అక్కడ నుండి హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారం రావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆ ప్రదేశానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని సహాయక చర్యల్లో పాల్గొంటున్న డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి ఆ కుటుంబాన్ని తరలించారు. సీఎస్ఆర్ గార్డెన్ సమీపం లో వరద ముంపు తీవ్రంగా ఉండడంతో అక్కడ ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా డిఆర్ఎఫ్ సిబ్బంది లైఫ్ బోట్ల ద్వారా హాస్టల్ నుండి బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా హసన్పర్తి లోని డిగ్రీ కళాశాలకు, సుబ్బయ్య పల్లి లోని కళాశాలకు, మడికొండ లోని బాలికల కళాశాలకు తరలించారు. విద్యార్థినులను అధికారులు, సహాయక బృందాలు సురక్షితంగా తరలిస్తుండగా కలెక్టర్ అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. హనుమకొండ లోని అలంకార్ జంక్షన్ తో పాటు కాపు వాడలో వరద ముంపు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరద ముంపు గురైన కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. వరద నీటి వల్ల ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు వరద ప్రభావ పరిస్థితులపై పర్యవేక్షణ చేయాలన్నారు.హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భీమారం శ్యామల చెరువు మత్తడి వద్ద నదిలా ప్రవహిస్తున్న నీరు

**నీట మునిగిన బొడ్రాయి ప్రాంత గృహాలు**

**గ్రామ నాయకులందరూ ఒక్కతాటిపై చేరి నాలా వెడల్పు**



**హన్మకొండ,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):**గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల భీమారం శ్యామల చెరువు బొడ్రాయి వద్ద మత్తడి ప్రవహిస్తున్నది. చాలా వరకు కాలనీలు నీట మునిగాయి. ఇది గ్రహించిన గ్రామ పెద్దలు, నాయకులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఒక్కతాటిపై చేరి ఎప్పటి నుంచో సమస్యగా ఉన్న నాళా ను మున్సిపల్ జేసీబీ సహాయంతో వెడల్పు చేయడంతో నీరు నిల్వ ఆగిపోయింది. దీంతో కొంత మేర చేరువ ప్రాంత ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ నాలా వెడల్పు క్రమంలో ప్రహరీ గోడ కూల్చివేతకు ఇంటి యజమానీ బూర సురేందర్ గౌడ్ సహరించడం తో పని త్వరగా పూర్తి అయింది. ఈ సందర్భంగా నాయకులందరిని ఏక తాటిపై నిలబెట్టి.. సమస్యను సర్దుమనిగేల చేసిన సంగాల విక్టరీ బాబు కి ప్రజలు కృతజ్ఞత తెలిపారు. మరియు మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డునూరి యాదగిరి ఇలాంటివి మున్ముందు జరగకుండా ఉండేందుకు నాల పై ఉన్న పూర్తి అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలని.. ప్రజల సమస్యలను పట్టించు కోవాలని కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత వేంకటేశ్వర్లు, 55 వ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అటికం రవీందర్, 55 వ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు గుంజె సాయికుమార్, భీమారం బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రాయకంటి సురేష్, నాతి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, ఆకుల కుమార్, రాయకంటి సుధాకర్, బూర శరత్, బీజేపీ నాయకులు పప్పుల రమేష్, నాతి రమేష్, వల్లల శ్రీధర్, జక్కుల విజయకుమార్, తోట రమేష్, దేశిని భరత్, పల్లపు రవికుమార్, కొండేటి హరీష్, తదితరులు పాల్గొన్నారు.



# క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి

**తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు**

**తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి**

**మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

**ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు**


**24x7 అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి**

**మొంథా తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎం**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారి ఇంచార్జిగా పెట్టాలని, ధాన్యం కొనుగోలు చేయడం, అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవడం, ధాన్యం తరలింపు, అవసరమైతే స్థానికంగా ధాన్యం స్టోర్ చేయడం వంటి పనులు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి కలెక్టర్ కు క్షేత్రస్థాయి పరిస్థితులపై రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రతి కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి చాలా కీలకమని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి క్షేత్రస్థాయిలో పని చేయాలని అన్నారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న రోడ్ల వద్ద వాహనాల రాకపోకలు నిలిపి వేయాలని అన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, నీటి వనరుల సమాచారం తెలుసుకొని, వాటికి సమీపంలో ఉన్న రోడ్లు, వంతెనలపై రాకపోకలను నిలిపివేయాలని, దీని కోసం స్థానిక పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు పడటం వల్ల తీవ్రంగా నష్టం జరిగిందని అన్నారు. పంట కోతల సమయంలో ఇలాంటి తుఫాన్ రావడం దురదృష్టకరమని, రైతులకు మొంథా తుఫాన్ తీవ్ర ఆవేదన కలిగించిందని సీఎం తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వ అధికారుల సెలవులు రద్దు చేయాలని, ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ పని చేయాలని అన్నారు. వరదల నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్, ఇతర పరికరాలు ఫీల్డ్ లో సిద్ధం పెట్టుకోవాలని, విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ లు సన్నద్ధం చేయాలని, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. తుఫాన్ వల్ల ప్రాణ నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని అన్నారు. డిజాస్టర్‌మేనేజ్మెంట్ యాక్ట్ క్రింద అవసరమైతే ఫంక్షన్ హాల్ లను వినియోగిస్తూ పంటలను స్టోర్ చేయాలని అన్నారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అవసరమైన జిల్లాలకు తరలించాలని అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో కలెక్టరేట్ లలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ వారికి అవసరమైన వైద్యం, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ... తుఫాన్ కారణంగా విద్యుత్ సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు డిస్కం అధికారులు తీసుకోవాలని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న 33/11 కేవి సబ్ స్టేషన్, 33 కేవి, 11 కేవి లైన్లను ఇప్పటికే 75 శాతం వరకు మరమ్మత్తు చేసి సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్లు అందుబాటులో ఉన్న నిధులు వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అధికంగా అందుబాటులో పెట్టాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... మొంథా తుఫాన్ వల్ల అంచనాల కంటే రెట్టింపు వర్షాలు పడ్డాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో వెళ్ళి పంట నష్టం ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యం ఈ రోజే వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లెవల్ కల్వర్ట్ దగ్గర పోలీసు భద్రత ఏర్పాటుచేసి ప్రయాణాలు అడ్డుకోవాలని అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి వర్యులు కొండ సురేఖ మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రజల ప్రాణాల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుందని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశామని అన్నారు. ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ... మొంథా తుఫాన్ తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. మరో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాన్ కారణంగా వచ్చిన భారీ ఆస్తి నష్టం నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచేలా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ సంబంధించి దెబ్బతిన్న రోడ్లు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మత్తులు చేసి వాహనాల రాకపోకలను వీలైనంత మేరకు పునః ప్రారంభించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న కాల్వలు, తెగిపోయిన చెరువులు, మీడియం ప్రాజెక్టుల నష్టం అంచనాలను తయారు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఖమ్మం నగరం పరిధిలో మున్నేరు నది ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో 90 కుటుంబాల పరిధిలో 227 సభ్యులను పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, పారిశుధ్యం, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ ఆస్తి నష్టం, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. తుపాన్ వల్ల 24 రోడ్లపై నీటి ప్రవాహం రావడం వల్ల రాకపోకలు నిలిపి వేసామని అన్నారు. జిల్లాలో ఉన్న చెరువులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఈ వీడియో సమావేశంలో డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, ఇరిగేషన్ ఎస్ఇ మంగళపుడి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, సిపిఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

## నయిమ్ నగర్ నాలా ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ,అక్టోబర్ 30(పిసిడబ్ల్యూన్యూస్):**మొంథా తుఫాన్ ప్రభావంతో నయిమ్ నగర్ నాలా ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రాంతాన్ని సందర్శించారు. నాల పరివాహక ప్రాంతంలో ఉన్న పరిస్థితులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో గతంలో భారీ వర్షాల కారణంగా జరిగిన ఘటనలు ఈసారి పునరావృతం కాకుండా కొంత మేర చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో ఇటువంటి ప్రమాదాలను అడ్డుకునేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్య వేక్షించాల్సిందిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు.

## నష్టం అంచనా వేసి పరిహారం అందించాలి : సిపిఐ



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాన్ కారణంగా వరి పంటకు జిల్లా వ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లిందని రైతులు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ నిండా ముంచిందని సురేష్ తెలిపారు. నదులు, ఏర్ల పరివాహక ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో మిర్చి ఇతర ఉద్యానవన పంటలకు కూడా నష్టం జరిగిందని నష్టం అంచనాను రూపొం దించి తక్షణం పరిహారం ఇవ్వాలన్నారు. పెట్టుబడి జరిగిన పంట నష్టం ఆధారంగా పరిహారాన్ని నిర్ణయించాలన్నారు. మున్నేరు వరద కారణంగా ఖమ్మం నగరంలో పలు కాలనీలు జలమయమయ్యాయని మున్నేరు బాధిత ప్రజలకు కూడా అంచనాల తర్వాత పరిహారం అందించాలన్నారు.

# తుఫాన్ నష్టానికి పరిహారం అందేలా ప్రభుత్వం కృషి

**రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**పంట నష్టం అంచనాల తయారీకి ఆదేశాలు జారీ**

**మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మొంథా తుఫాన్ కారణంగా పేద ప్రజలు కోల్పోయిన ఇండ్లు, పశువులు, పంట, ఇతర నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రివర్యులు, గురువారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన కాల్వ ఒడ్డు బ్రిడ్జ్, నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ లలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... వాతావరణ శాఖ మొంథా తుఫాన్ పై సమాచారం అందించిన వెంటనే జిల్లా కలెక్టర్, యంత్రాంగంను అప్రమత్తం చేసి ముందస్తు చర్యలో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను రిలీఫ్ క్యాంపులకు తరలించడం జరిగిందని అన్నారు. రిలీఫ్ క్యాంపులో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించామని అన్నారు. రాత్రి నిద్ర పోకుండా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ప్రతి అరగంటకు ఒకసారి మానిటర్ చేస్తూ జిల్లా యంత్రాంగం పని చేసిందని మంత్రి ప్రశంసించారు. మున్నేరు నది 26 అడుగుల ఎత్తులో ప్రవహించిందని, నెమ్మదిగా నీటి ప్రవాహం తగ్గుతుందని మంత్రి అన్నారు. మున్నేరు నది పరివాహక ప్రాంతంలో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను కాపాడిన కలెక్టర్, పోలీసులకు, మున్సిపల్ కమీషనర్, ఇతర యంత్రాంగానికి మంత్రి అభినందనలు తెలియజేశారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను తయారు చేయాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పక్కా రిపోర్టు అధికారులు తయారు చేస్తారని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయిన నష్టపోయిన ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 11 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఖమ్మం నగరానికి ఎటువంటి ప్రమాదం ఉండదని మంత్రి తెలిపారు. రిటైనింగ్ వాల్ పూర్తి చేయడంలో ప్రజలు సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి దంసలాపురం వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించిన బిఆర్ఎస్ బృందం

**- అకాల వర్షాలతో అల్లకల్లోమైన రైతును పరామర్శించిన నాయకులు.**

**- తక్షణమే ప్రభుత్వం స్పందించాలి.. రైతుకు నష్టపరిహారం 25 వేల రూపాయలు అందించాలి**

**- మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట నర్సయ్య**



**ఖానాపూర్ అక్టోబర్ 30(పీసీడబ్ల్యూ న్యూస్):** మోంథా తుఫాన్ ప్రభావం వల్ల పాకాల ఆయకట్టు కింద సుమారు 20000 ఎకరాల్లో పంట నెలకొరిగిందని అన్నారు. వరంగల్ జిల్లాలో అత్యధికంగా మోంథా తుఫాను ప్రభావం ఖానాపురం మండలంలో బీభత్సం సృష్టించిందని తెలిపారు. సుమారు రెండు రోజుల నుండి 18 గంటలుగా ఈదురు గాలులతో కురిసిన బారి వర్షానికి పంట పూర్తిగా నేలకొరిగి నీళ్లలో పడిపోయిందని తెలిపారు. మొక్కజొన్న, పత్తి పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంటలపై ఇంతవరకు సర్వే చేయించి రైతుకు ధైర్యం కల్పించాల్సిన ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాడు యూరియా దొరకక బ్లాక్ లో ఎక్కువ ధరకు కొనుగోలు చేసి పంట అంతత మాత్రమే పండిస్తుంటే. భారీ వర్షాలతో రైతు పూర్తిగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్ట సర్వే చేయించి ఎకరాకు 25వేల రూపాయల పరిహారం రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు వల్లపు శ్రీనివాస్, ఆబోతు అశోక్ యాదవ్, నీలం సాంబయ్య , దాసరి రమేష్, నామల రవి, మెరుగు సాంబయ్య, గంగాపురం రాజు, కుందనపల్లి సుధాకర్, ఉప్పు కిరణ్, కుంచం వెంకన్న కందుల శ్రీను జ్యోతుల చిన్న బిక్షం కోడూరీ స్వామి, కుంచం సారయ్య, మడత బిక్షపతి రైతులు పాల్గొన్నారు.

# హనుమకొండ మళ్లీ మునిగిపోయింది - రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం!

**"రూ.100 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రెయిన్ వృథా - వినయ్ భాస్కర్, కేటీఆర్ ల మోసం బహిర్గతం!"**

**మళ్లీ అదే కాలనీలు మునిగాయి - సీఎం, మేయర్, అధికారుల నిర్లక్ష్యం స్పష్టమైంది!"**




**హన్మకొండ,అక్టోబర్ 30(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీజేపీ ప్రెస్ మీట్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-% అమరావతి నగర్, సప్తగిరి కాలనీ, టీజీఎన్ఓ కాలనీ, సమ్మయ్య నగర్, హంటర్ రోడ్, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్ తదితర 100 కు పైగా కాలనీలు వరద నీటిలో మునిగిపోయాయి. ప్రజలు భవనాల పై అంతస్తుల్లో, టెర్రస్‌ల పై సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. నీరు ఇళ్ల మొదటి అంతస్తు వరకు చేరింది. అమరావతి నగర్ లో రూ.100 కోట్లు ఖర్చుతో చేసిన అండర్ డ్రెయిన్ టన్నెల్ పనికి రాలేదు. ఇది పూర్తిగా వృథా అయింది. ఈ ప్రాజెక్ట్ కేవలం అప్పటి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మరియు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికే చేయబడిందని విమర్శించారు. కేటీఆర్ స్వయంగా హామీ ఇచ్చి "హనుమకొండ లో ఇక వరదలు రావు" అన్నారు. కానీ ఆ హామీ కూడా వృథా అయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తూ కేవలం ఓట్ల కోసమే తప్పుడు హామీలు ఇస్తున్నాయని ఆయన అన్నారు. హనుమకొండ లో నిజమైన అభివృద్ధి సాధ్యమయ్యేది కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అమృత్ పథకం ద్వారానే అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి "ఇక రోడ్లపై నీరు కనిపించదు" అని చెప్పిన వీడియో ఇప్పుడు ప్రజల చేత సోషల్ మీడియాలో ట్రోలింగ్ అవుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలు అధికారంలో ఉన్నా, హనుమకొండ%-%వరంగల్ అభివృద్ధి దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదని, కేవలం హైదరాబాద్ మీదే దృష్టి పెట్టారని అన్నారు. ఆయన రేపు వరంగల్ కి వస్తున్న నేపథ్యంలో, ప్రజలకు ఏం ఇవ్వబోతున్నారు? కనీసం హనుమకొండ పునరుద్ధరణకు ఏదైనా ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. మేయర్, మున్సిపల్ అధికారులు స్టడీ టూర్లకు వెళ్ళి ప్రజల డబ్బు వృథా చేస్తున్నారు, కానీ ఫలితం ఏమాత్రం లేదని అన్నారు. ప్రజలు చిన్న పిల్లలకు పాలు దొరకక, ఆహారం లేక ఇళ్ల పై కప్పులపై బతుకు తెరచుకుని ఉన్నారు. ప్రతిసారి ఇదే ప్రాంతాలు వరదలో మునుగుతున్నా, ప్రభుత్వానికి ముందస్తు చర్యల ఆలోచనే లేదని మండిపడ్డారు. కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్లు కూడా పనిచేయడం లేదు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇద్దరూ ప్రజలను మోసం చేశారని అన్నారు.హనుమకొండ%-%వరంగల్ అభివృద్ధికి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం, ప్రజలకు నిజమైన ఆశ బీజేపీ ప్రభుత్వమే అని జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్ లో రాష్ట్ర ఎస్టీ మోర్చ నాయకుడు నాను నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జిల్లా కార్యదర్శి కుతురు రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గొౢరె ఓం ప్రకాష్, మాజీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చ.రాజి రెడ్డి, అరణ్య రెడ్డి, విభాగ అధ్యక్షులు అదేపు రాజు, రేవంత్, జితేందర్, మూల రాము గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో అన్నగా అండగా ఉంటా!

**- ముంపు ప్రాంత ప్రజలకు కార్పొరేటర్ రాజు భరోసా!**

**- కలెక్టర్‌తో కలిసి .. ముంపు ప్రాంతాల్లో పర్యటన..**




**హన్మకొండ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :**హన్మకొండ లోని 31 వ డివిజన్ న్యూ శాయంపేట లో మొంథా తుఫాన్ ప్రభావంతో ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ముంపు ప్రాంతాల ప్రజలకు భరోసా ఇచ్చారు 31 డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు.31 డివిజన్లోని ముంపు ప్రాంతాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశం మేరకు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరిష్ సహకారంతో.. వరదల్లో చిక్కుకున్న కాలనీలకు ఆహార పొట్లాలను కార్పొరేటర్ రాజు పంపిణీ చేశారు. ఎంతటి ఆపద వచ్చినా .. ఓ అన్నగా మీకు అండగా ఉంటానని.. డివిజన్ ప్రజలు ఎలాంటి అధైర్య పడవద్దని కాలనీలలో వరద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతు న్నాయని, వర్షం తగ్గిన కూడా వరద ఉధృతి అలాగే ఉందని మీకు ఏ సహకారం కావాలన్నా తనకు నేరుగా ఫోన్ చేయాలని కార్పొరేటర్ కోరారు. అధికార యంత్రాంగం డిప్యూటీ కమిషన్ రవీందర్,కాజీపేట తహ సిల్దార్ ఇస్లావత్ భావు సింగ్,సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు,మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్,DRF రెస్క్యూ టీం మరియు మున్సిపాలిటీ వర్కర్స్ ఎప్పటికప్పుడు .. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహా యక చర్యల్లో పాల్గొంటున్నారని.. వరద ఉధృతి తగ్గేవరకు.. కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని,చిన్న పిల్లలను బయటకి రాకుండా చూసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

# లంచం ఇవ్వడం లేదా తీసుకోవడం నేరం

**- ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్**

**- అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు టిజీఎస్ఆర్టీసీ విజిలెన్స్ అవగాహన సదస్సులు**

**- పారదర్శకత, బాధ్యత, న్యాయసమానత ఆధారంగా సంస్థ పాలనకు కట్టుబడి ఉంటామని టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ప్రతిజ్ఞ**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లంచం ఇవ్వడం గానీ తీసుకోవడం గానీ నేరమని ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్ అన్నారు. నగరంలోని ఖమ్మం డిపో మెయిన్ గేట్ సెక్యూరిటీ బ్రాంచ్ ముందు గురువారం విజిలెన్స్ అవగాహన సదస్సు జరిగింది. విజిలెన్స్ అవగాహన సదస్సులో ఖమ్మం డిపో మేనేజర్ ఎం శివప్రసాద్ మాట్లాడుతూ... టీజీఎస్ఆర్టీసీ ఎండి, విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ వారి ఆదేశాల ప్రకారం అక్టోబర్ 7 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్స్ అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజిలెన్స్ అవగాహన సదస్సులో భాగంగా సంస్థ ఉద్యోగులతో లంచం ఇవ్వడం గానీ తీసుకోవడం గానీ నేరమని, నైతిక వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడం, నిజాయితీ, నిబద్ధత కలిగిన సంస్కృతిని పెంపొందించడం, పారదర్శకత, బాధ్యత, న్యాయసమానత ఆధారంగా సంస్థ పాలనకు కట్టుబడి ఉంటామని, ఫిర్యాదుల పరిష్కారం, విజిల్ బ్లోయర్ విధాన ఏర్పాటు తదితర అంశాలపై డిపో మేనేజర్ శివప్రసాద్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇదేవిధంగా కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ వద్ద సెక్యూరిటీ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్ కోటాజి ఆధ్వర్యంలో ఉద్యోగులతో విజిలెన్స్ సదస్సు అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ గౌతమి, ఎం.ఎఫ్ ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ కంచె భాస్కర్, కానిస్టేబుల్ ఎస్.కె సలీం, 50మంది ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వధించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్



**యాదాద్రి అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని వైబిఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం రోజున జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులైన హరీష్ కుమార్ - సంధ్యలను ఆశీర్వదించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్.ఈకార్యక్రమంలో కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి,మాజీ వైఎస్ ఎంపిపి కాలే మల్లేష్, మాజీ ఎంపిటిసి బూడిద రాములు గౌడ్, మాజీ సర్పంచ్లు లగ్గాని రమేష్ గౌడ్,బీసు చందర్ గౌడ్,కోడిమాల యాదగిరి గౌడ్, తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మున్నేరు ముంపు నిర్వాసితులకు అండగా ఉంటాం

**కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావు**








**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మొంథా తుఫాను ప్రభావంతో గత 24 గంటల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం నగరంలోని మున్నేరు ఉధృత్తి 26 అడుగులకు చేరి ఖమ్మం నగరం 47, 48 డివిజన్ లోని పద్మావతి నగర్, వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ ప్రాంత ప్రజల ఇళ్లలోకి నీరు చేరి దిక్కుతోచని పరిస్థితుల్లో రోదిస్తున్నా ఆ కుటుంబాలను 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు అక్కున చేర్చుకుని ఆకలితో ఉన్న ఆ వందలాది కుటుంబాలకు గురువారం అన్న ప్రసాదాలు అందించారు.అనంతరం తోట గోవిందమ్మ రామారావు మాట్లాడుతూ... రోజువారి కూలీ చేసుకునే ఈ కుటుంబాలకు గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ మున్నేరు ఉధృత్తి వాళ్ల జీవనవిధానాన్ని చీకటిమయం చేస్తుందని, వేలాది రూపాయల ఆస్తినష్టంతో పాటు మానసిక రోదనను కలిగిస్తుందని అన్నారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరదలతో సర్వస్వం కోల్పోయి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ కుటుంబాలను మొంథా తుఫానుతో మున్నేరు ఉధృతి మరలా ఆ కుటుంబాలలో చీకటి క్షణాలను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ కుటుంబాలకు ఇంటి పెద్దగా.. మా కుటుంబ సభ్యులతో సహా ఎల్లవేళలా అండగా ఉంటూ వారిని అనుక్షణం తమ కుటుంబ సభ్యులుగానే, వారి కష్టాలలో పాలుపంచుకుంటూ రాత్రింబవళ్లు వారికి తోడుగా ఉంటూ తిండి తిప్పలకు దూరమవుతున్న ఆ బాధితులకు గతంలో అందించిన విధంగానే ఈరోజు నుంచి వారు క్షేమంగా వారి ఇంటికి చేరుకునే వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు అన్న ప్రసాదములు అందించే దిశగా ఏర్పాట్లు చేశామని, మీరంతా ధైర్యంగా ఉండాలని, మేము మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు.ఉప్పొంగి ప్రవహిస్తున్న ఆ గంగమ్మ తల్లి శాంతించి అమ్మవారి ఆశీస్సులతో ఆ కుటుంబాలు యధాస్థితిని పొందాలని ప్రార్థిస్తూ.. ఆ ప్రాంత మహిళలతో కలిసి గోదావరి అమ్మవారికి చీర, జాకెట్, పూలు, కొబ్బరికాయ, పసుపు, కుంకుమలతో కూడిన సారను అందించటం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట రమేష్, వంగాల వెంకట్ చేతి, కృష్ణ, బాబా, కిషన్ నాయక్, నిరంజన్, కునుపూరి మహేష్ కునుపూరి మధు రవీందర్, వీరేందర్, మాధవరావు, లింగా రెడ్డి, ప్రాంత యువత, మహిళలు పాల్గొన్నారు.

## చెట్లను నరికి వేసిన వారిపై జరిమాన విధించిన అటవీ శాఖ

**యాదాద్రి అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామ శివారులోని శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో చెట్లను నరికివేసిన దేవాలయ కమిటీ సభ్యులపై ఇటీవల చర్యలు తీసుకోవాలని తాజ్పూర్ గ్రామస్తులు జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం రోజున ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ నాయక్ జరిమానా రూ.12,160 రూపాయలు దేవాలయ కమిటీపై విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అటవీశాఖకు తెలపకుండా ఎవరైనా చెట్లను నరికి వేసినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ రఘురాంరెడ్డి

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. ఆ కమిటీ సభ్యులైన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సమావేశానికి హాజరయ్యారు. డిజిటల్ వృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికకు సంబంధించి పలు సూచనలు చేశారు. నూతనంగా ఏర్పాటైన ఈ కమిటీలో.. వరుసగా రెండోసారి స్థానం దక్కించుకున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి. స్పెక్ట్రమ్ నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.



# అమితాబ్ మనవడి 'ఇక్కీస్'.. ఆకట్టుకుంటున్న ట్రైలర్




బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన బయోపిక్ రాబోతోంది. దేశ అత్యున్నత సైనిక పురస్కారం 'పరమవీర చక్ర'ను అతి పిన్న వయసులో అందుకున్న వీర సైనికుడు, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా 'ఇక్కీస్' అనే చిత్రం తెరకెక్కుతోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద ఈ చిత్రంలో అరుణ్ ఖేతర్‌పాల్ పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.'అంధాధున్' వంటి విజయవంతమైన చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న శ్రీరామ్ రాఘవన్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దిగ్గజ నటుడు ధర్మేంద్ర, 'పాతాళ్ లోక్' ఫేం జైదీప్ అహ్లావత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విడుదలైన ట్రైలర్, 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. యుద్ధభూమిలో అరుణ్ ఖేతర్‌పాల్ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమను ట్రైలర్‌లో ఆవిష్కరించారు.కేవలం 21 ఏళ్ల వయసులోనే దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అరుణ్ ఖేతర్‌పాల్ త్యాగాన్ని ఈ సినిమా గుర్తు చేయనుంది. ఆయన అసమాన పరాక్రమానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం మరణానంతరం పరమవీర చక్ర పురస్కారంతో సత్కరించింది. ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# కొత్త గెటప్ లో ఆషికా !



ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్ లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసేసరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్ లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది. అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్ లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది.

ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్ కి క్యాప్షన్ గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హాట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.మరి హీరోయిన్ సడెన్ గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది.

# అలా చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు: రవితేజ

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' సినిమా రూపొందింది. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో భాను భోగవరపు మాట్లాడుతూ, "నేను రవితేజ గారి అభిమానిని. అయన సినిమాలలో నాకు 'వెంకీ' అంటే చాలా ఇష్టం. ఆయనతోనే నా ఫస్టు మూవీ ఉంటుందని నేను అసలు ఊహించలేదు" అని చెప్పారు. ఈ సినిమాకి 'మాస్ జాతర' అనే టైటిల్ పెట్టింది రవితేజ గారే. ఇది సాలిడ్ టైటిల్ కావడంతో, అందుకు తగినట్టుగా సీన్స్ ను డిజైన్ చేసుకోవడం జరిగింది. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. ఇక హైపర్ ఆది మాట్లాడుతూ .. 'ధమాకా' తరువాత నుంచి రవితేజ గారి సినిమాలలో వరుసగా చేస్తూ వెళుతున్నాను. ఈ సినిమాలు రవితేజగారితో కలిసి నేను చేసే కామెడీ ఆడియన్స్ కి నచ్చుతుంది" అని అన్నారు. ఇక రవితేజ మాట్లాడుతూ .. " వేరే ఏ విషయం గురించి మాట్లాడమని చెప్పినా మాట్లాడతాను. కానీ నా గురించి .. నా సినిమాను గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ఇలా వచ్చేస్తున్నాయ్ .. అలా వచ్చేస్తున్నాయ్ .. బాగా వచ్చేస్తున్నాయ్ అన్ని నేను చెప్పలేను. భాను డైరెక్షన్ .. అతని రైటింగ్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనేది మాత్రం నిజం. ఒకటి మాత్రం చెప్పగలను .. మనకి మరో కమర్షియల్ డైరెక్టర్ వస్తున్నాడు" అని అన్నారు.

# రష్మిక మందన్నకు మరో హిట్.. వంద కోట్ల క్లబ్ లో చేరిన బాలీవుడ్ మూవీ



పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న మరో హిట్ సినిమాను తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటించిన హారర్ కామెడీ చిత్రం 'థమ్మా' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. సెప్టెంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, 100 కోట్ల క్లబ్ లో చేరింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 9వ రోజు (అక్టోబర్ 29న) ఈ చిత్రం కేవలం రూ. 3.25 కోట్లు వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వసూళ్లు రూ. 104.60 కోట్లకు చేరాయి. రెండో బుధవారం హిందీలో ఈ చిత్రానికి 10.10% ఆక్యుపెన్సీ నమోదైంది. ఉదయం షోలకు 6.28% ఆక్యుపెన్సీ ఉండగా, రాత్రి షోలకు అత్యధికంగా 13.96% నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ మ్యాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. 'స్త్రీ', 'స్త్రీ 2', 'భేదియా', 'ముంజ్యా' చిత్రాల తర్వాత మ్యాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో వచ్చిన ఐదో సినిమా ఇది. ఇందులో అలోక్ గోయల్ అనే జర్నలిస్టు పాత్రలో ఆయుష్మాన్ ఖురానా నటించగా, రక్తపిశాచి (వాంపైర్) అయిన తాడక పాత్రలో రష్మిక మందన్న కనిపించింది. వీరిద్దరి మధ్య నడిచే విభిన్నమైన ప్రేమకథే ఈ సినిమా.ఈ చిత్రం తన కెరీర్‌లోని అతిపెద్ద కమర్షియల్ హిట్స్‌లో ఒకటిగా నిలవడంపై హీరో ఆయుష్మాన్ ఖురానా ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ సినిమా పిల్లలను బాగా ఆకట్టుకోవడం తనను ఎంతగానో సంతోషపరిచిందని ఆయన అన్నారు. "థమ్మాలో నాకు బాగా నచ్చిన విషయం ఏంటంటే, ఇది పిల్లలకు నచ్చడం. నా కెరీర్‌లో పిల్లలు ఇష్టపడిన మొదటి సినిమా ఇదే. ఈ సినిమాలోని స్పెషల్ ఎఫెక్ట్స్, కథనం పిల్లలకు అనుకూలంగా ఉంటాయి. నా పిల్లలకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది" అని తెలిపారు. ఈ చిత్రంలో పరేశ్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఫైసల్ మాలిక్, గీతా అగర్వాల్ శర్మ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు.

# హైదరాబాద్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ మరోసారి హైదరాబాద్ సంగీత ప్రియులను తన స్వరాలతో అలరించనున్నారు. నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా ఆయన భారీ లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతున్నారు. హైదరాబాద్ టాకీస్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో రెహమాన్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ, "హైదరాబాద్ అత్యంత డైనమిక్ నగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి ప్రజలు లైవ్ కాన్సర్ట్‌లను ఎంతగానో ఆదరిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా ప్రేక్షకులు నిజమైన సంగీత అనుభూతి కోసం ఇలాంటి కార్యక్రమాలకు రావడం కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది" అని అన్నారు. ఇది సంగీతం పట్ల ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ టాకీస్ వ్యవస్థాపకుడు సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి సంగీత అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ ఏడాది ఆరంభంలో ఎం.ఎం. కీరవాణితో కార్యక్రమం నిర్వహించాం. ఇప్పుడు రెండోసారి ఏఆర్ రెహమాన్‌ను నగరానికి తీసుకురావడం గర్వంగా ఉంది. ఈ ఈవెంట్ కోసం దీపక్ చౌదరి, ఇవా లైవ్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని తెలిపారు.భారతీయ సంగీతాన్ని ప్రపంచ వేదికలపై వినిపించిన రెహమాన్, తన లైవ్ ప్రదర్శనలతో ఇప్పటికే ఎంతో మందిని మంత్రముగ్ధులను చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో జరగబోయే ఈ సంగీత విభావరిలో ఆయన తన కెరీర్‌లోని ఎన్నో సూపర్ హిట్ గీతాలను ప్రత్యక్షంగా ఆలపించనున్నారు. దీంతో నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ రెహమాన్ స్వరాలతో మార్మోగడం ఖాయంగా కనిపిస్తోంది





# బైకర్తో శర్వా మాస్టర్ ప్లాన్!

'చార్మింగ్ స్టార్' శర్వానంద్ చాలా కాలంగా ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ట్రై చేస్తున్నాడు. 'ఒకే ఒక జీవితం' పర్వాలేదనిపించినా, ఆయన రేంజ్‌కు తగ్గ బ్లాక్‌బస్టర్ మాత్రం ఇంకా పడలేదు. రొటీన్ కథలు, ఫ్యామిలీ డ్రామాలు వర్కవుట్ అవ్వకపోవడంతో, శర్వా ఈసారి రూట్ మార్చినట్లున్నాడు. తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, 'బైకర్' అనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు.ఈ సినిమా కోసం శర్వా డెడికేషన్ నెక్స్ట్ లెవల్‌లో ఉంది. కేవలం కథ నచ్చి ఓకే చెప్పడమే కాదు, ఆ పాత్ర కోసం తనను తాను పూర్తిగా మార్చుకున్నాడు. 'బైకర్' లుక్ కోసం బరువు తగ్గి, చాలా లీన్‌గా తయారయ్యాడు. అంతేకాదు, ఇది రెగ్యులర్ యాక్షన్ కాదు, 'డర్ట్ బైక్ యాక్షన్' కావడంతో, ఏకంగా మూడు నెలల పాటు స్పెషల్ ట్రైనింగ్, డైట్, జిమ్‌తో కష్టపడ్డాడని సమాచారం.ఈ సినిమాతో అభిలాష్ రెడ్డి కంకర దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. యూవీ క్రియేషన్స్ లాంటి బడా సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటంతో, టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. తెలుగు సినిమాకు 'డర్ట్ బైక్ రేసింగ్' అనేది చాలా కొత్త జానర్. శర్వా ఈ రిస్క్ తీసుకోవడమే ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్.అయితే, ఈ కొత్త జానర్‌ను ఆడియెన్స్‌కు కరెక్ట్‌గా ఎక్కించడానికి మేకర్స్ ఒక మాస్టర్ ప్రమోషనల్ ప్లాన్ వేశారు. 'బైకర్' నుంచి "ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్" పేరుతో ఒక టీజర్‌ను రెడీ చేశారు. కానీ, దాన్ని నేరుగా యూట్యూబ్‌లో వదలడం లేదు. ఇది చాలా స్మార్ట్ మూవ్. ఈ గ్లింప్స్‌ను అక్టోబర్ 31 నుంచి థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు. అది కూడా ఈ వారం బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి రెడీగా ఉన్న 'బాహుబలి: ది ఎపిక్' రీ-రిలీజ్‌తో పాటు, రవితేజ 'మాస్ జాతర' సినిమా షోలతో పాటు దీన్ని అటాచ్ చేశారు.